క్లుప్తంగా

పుస్తక పఠనం తప్పనిసరి

ఫిరంగిపురం: విద్యార్థులు పుస్తక పఠనం తప్పనిసరిగా చేయాలని ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి పి.జేమ్స్ అన్నారు. మండల కేంద్రంలోని గాలిబాలిశాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులను సోమవారం నిర్వహించారు. కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు చదివే విధానం, ఏ పుస్తకాలు చదవాలి అనే అంశాలపై ఉపాధ్యాయుడు రాజు వివరించారు. అనంతరం విద్యార్థులతో పుస్తకాలను చదివించారు. కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షపు నీటి నిల్వతో అవస్థలు



తాడికొండ: చినుకు పడితే వర్షపు నీరు నిల్వ ఉంటూ లాం–గుంటూరు ప్రధాన రహదారి పక్కన నిలిచి తటాకాలను తలపిస్తుంది. దీంతో రహదారి అధ్వాన్నంగా మారుతోంది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేని కారణంగా రెండు రోజులుగా రోడ్డుపైనే నీరు నిలిచిపోయింది. నీటి నీల్వలతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని వాహన చోదకులు వాపోతున్నారు. దోమలు సైతం విజృంభించి విష జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సరైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థులకు సమ్మర్ క్యాంప్



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని చిగురు గ్రామంలో పిల్లల కోసం నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో సోమవారం సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ మేనేజర్ వసంత కుమారి మాట్లాడుతూ.. 2025 సంవత్సరానికి రెస్పాన్సిబిలిటీ అనే థీమ్‌ను ఎంచుకుని ఈ క్యాంప్‌లో పిల్లలందరికీ డ్యాన్స్, క్రాఫ్ట్ వర్క్‌లో శిక్షణ ఇచ్చామని తెలిపారు. సుమారు 45 మంది విద్యార్థులు శిక్షణ పొందినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్యుమెంటేషన్ ఇన్‌చార్జి శ్రవణ్ కుమార్, నర్స్ సునీత, లెర్నింగ్ టీచర్లు దుర్గ, తిరుపతమ్మ, సుజాత, స్వర్ణగౌరి, సంధ్య, చంద్రిక, శిరీష, ప్రియాంక, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 523ను వెంటనే రద్దు చేయాలి

తెనాలిఅర్బన్: జీవో నెంబర్ 523ను వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ తెనాలి పట్టణ అధ్యక్షుడు షేక్ జానీబాషా డిమాండ్ చేశారు. సోమవారం తెనాలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 523 వలన ఉద్యోగులకు అనేక ఇబ్బందులు ఉన్నాయని ఆరోపించారు. ఉద్యోగులకు ఉన్న అనుమానాలను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని కోరారు. అలాగే సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలని, సర్వీసు రూల్స్ ఏర్పాటు చేసి ఉద్యోగులకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కార్యదర్శి కె.ధర్మసాయి, అజయ్, భాస్కర్, కళ్యాణ్ పాల్గొన్నారు.

యువతితో అసభ్య ప్రవర్తన

తెనాలిరూరల్: తనను పెళ్లి చేసుకోవాలంటూ యువతితో యువకుడు అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మారిస్‌పేట సీఎం కాలనీకి చెందిన యువకుడు బషీర్ ఆదివారం సాయంత్రం అదే కాలనీకి చెందిన యువతి ఇంటికి వెళ్లి తనను పెళ్లి చేసుకోవాలంటూ అసభ్యంగా ప్రవర్తించాడు. యువతి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అతనిపై త్రీ టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

డ్రోన్ తో పోలీసుల నిఘా

తెనాలిరూరల్: డ్రోన్‌తో పోలీసులు నిఘా పెడుతున్నారు. తెనాలి త్రీ టౌన్ పరిధిలోని మార్కెట్‌యార్డు, రెండు గేట్ల మధ్యం ప్రాంతం, చినపరిమి డొంక, పినపాడు, శాంతినగర్, టిడ్కో గృహాల వద్ద సీఐ ఎస్. రమేష్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం డ్రోన్‌ను ఎగురవేసి ఆయా ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలను, రద్దీ ప్రాంతాలను పరిశీలించారు. సంఘ విద్రోహ చర్యలు గంజాయి అరికట్టేందుకు డ్రోన్‌ను వినియోగించనున్నట్టు పోలీసులు తెలిపారు. ఎస్ఐలు ప్రకాశరావు, కరిముల్లా, సిబ్బంది ఉన్నారు.

ప్రారంభమైన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

తెనాలిఅర్బన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 నిమిషాల వరకు పరీక్ష జరిగింది. మొదటిరోజు తెలుగు పరీక్ష జరిగింది. ఉదయం 9 గంటల నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు అనుమతించారు. తెనాలిలో ఎన్‌సీఆర్ఎస్ఎం హెచ్ స్కూల్, కెఎస్ఎంహెచ్ స్కూల్, బాయ్స్ హైస్కూల్, గరల్స్ హైస్కూల్, ఏఎస్ఎస్ఎం స్కూల్‌లను పరీక్ష కేంద్రాలుగా అధికారులు ప్రకటించారు. మొదటి రోజు ప్రశాంతంగా జరిగిందని ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ తెలిపారు.

తాగునీటి పథకానికి అమృత 2.0 దన్ను



గుంటూరు ఛానల్ వద్ద గల తాగునీటి పథకం

రూ.54.01 కోట్ల నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి మార్గం సుగమమైంది. తాగునీటి పథకానికి అమృత 2.0లో భాగంగా రూ.54.01 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఇటీవల ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ పనులకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రతి ప్రాంతానికి తాగునీరు..



మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజలకు తాగునీటి సరఫరా చేసేందుకు ప్రభుత్వం అమృత 2.0లో రూ.54.01 కోట్లు మంజూరు చేసింది. దీని ద్వారా ఎంటీఎంసీ లోని ప్రతి ప్రాంతానికి తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
– అలీంబాషా, కమిషనర్, ఎంటీఎంసీ

15వ ఆర్థిక సంఘం ద్వారా కార్పొరేషన్‌కు కేటాయించే నిధుల మొత్తాన్ని తాగునీటి పథకానికి వెచ్చించాలని ప్రభుత్వం సూచించింది. ప్రభుత్వం విడుదల చేసిన రూ.54.01 కోట్లతో తాగునీటి పథకం విస్తరించడం.. రానున్న 30 సంవత్సరాలలో కార్పొరేషన్‌లో పెరగనున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని ఫిల్టరేషన్ పాయింట్లు నిర్మిస్తారు.

ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి



గుండిమెడలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లి రూరల్: దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. గుండిమెడ గ్రామంలో సుందరయ్య చిత్రపటానికి సీపీఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, డోకిపర్తి రాజేంద్రబాబులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు నాగపోగు విజయరాజు పార్టీ జెండాను ఆవిష్కరించారు. చిర్రావూరు గ్రామంలో సుందర్య విగ్రహానికి పల్లపాటి సుబ్బారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, బత్తుల సంసోన్, బుర్ర రాజు, పల్లపాటి సుబ్బారావు, పరిమిశెట్టి శివ నాగేశ్వరరావు, శ్రీపతి, వీరయ్య, కాసరగడ్డ వెంకటేశ్వరరావు, ప్రవీణ్, దావులూరి సత్యం తదితరులు పాల్గొన్నారు. ఉండవల్లిలోని సుందరయ్య చౌక్ వద్ద సీపీఎం నాయకులు ఎం.రవి, ఈమని రామారావు, బక్కిరెడ్డి, వల్లభాపురం వెంకటేశ్వరరావు తదితరులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలక వర్గాల ప్రజా వ్యతిరేక విధానాలపై సుందరయ్య అలుపెరుగని పోరాటం చేశారని పలువురు నాయకులు అన్నారు. సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు సుందరరావు, జగదీశ్వర్ రెడ్డి, రాఘవయ్య, గాంధీ, పార్థసారధి, శేషయ్య, చెంచయ్య, మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, వేముల దుర్గారావు, ఫిరోజ్ ఖాన్, దొంతిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రామారావు, సీహెచ్ భుజంగరావు, బాషా, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సేవలు ఎనలేనివి..

దుగ్గిరాల: పుచ్చలపల్లి సుందరయ్య సేవలు ఎనలేనివని సీపీఎం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. మండలంలోని మంచికలపూడిలో సుందరయ్య వర్ధంతిని నిర్వహించి ఆయన సేవలను కొనియాడారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. వై.బ్రహ్మేశ్వర రావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, కౌలు రైతుసంఘం నాయకులు ఎం.నాగమల్లేశ్వర రావు, ఎ.పాములు, వెంకటేశ్వరమ్మ, వి.శేషగిరి, వై.తనూజ, వై.చేగువేరా తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: మండల కేంద్రంలో సీఐటీయూ మండలశాఖ ఆధ్వర్యంలో సోమవారం పుచ్చలపల్లి వర్ధంతిని నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి షేక్.మస్తాన్‌వలి కామ్రేడ్ సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బి.ఇబ్రహీం, కె.ఏసు, సునీత, ఏసమ్మలు పాల్గొన్నారు.

మంగళగిరి: సుందరయ్య స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు కొనసాగించాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. మండలంలోని కాజ, ఆత్మకూరు గ్రామాలలో సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు భీమిరెడ్డి కోటేశ్వరి, మొసలి ఫకీరయ్య, తమ్మ ప్రసాదరెడ్డి, నరసింహారావు, గాదె మాధవ రెడ్డి, ఎం.జ్యోతిబస్సు, రామారావు, సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

మేడికొండూరు: మండలంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పలు రంగాల కార్మికులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సీపీఎం నాయకుడు బొట్ల రామకృష్ణ మాట్లడుతూ.. సుందరయ్య సమాజం కోసం తన జీవితం అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో ఇమామ్ షరీఫ్, రైతులు, కార్మికులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరిగా మహంకాళి



దుగ్గిరాల: మండలంలోని కంఠంరాజుకొండూరులో కొలువైన శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో 48వ పునఃప్రతిష్ఠ వార్షికోత్సవం వైభవంగా కొనసాగుతుంది. వేడుకల్లో భాగంగా ఆలయంలో రెండో రోజు చండీ హోమం నిర్వహించారు. మంచికలపూడికి చెందిన యార్లగడ్డ రోహిణి కుమార్, సంధ్యారాణి దంపతులు హోమం క్రతువులో పాల్గొన్నారు. భక్తులకు అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఏర్పాట్లను ఈ.వో కె.సునీల్ కుమార్ పర్యవేక్షించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు ముందు వెళుతున్న మోటారు సైకిల్‌ను లారీ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడికొండూరు మండలం డోగిపర్రు గ్రామానికి చెందిన టి.బ్రహ్మేశ్వరరావు(37) తమ ద్విచక్రవాహనంపై గుంటూరు వైపు వెళుతున్నారు. ఈ క్రమంలో వేములూరిపాడు గ్రామ శివారులో అదే మార్గంలో వెళుతున్న లారీ ముందున్న ద్విచక్రవాహనాన్ని వేగంగా ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న బ్రహ్మేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ మురళీకృష్ణ , రైటర్ దాసులు సంఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి మృతదేహాన్ని గుంటూరు మార్చురీకి తరలించారు.

సినిమా ఎగ్జిబిటర్లతో చర్చలు జరపండి

తెనాలిఅర్బన్: జూన్ ఒకటి నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో సినిమా ప్రదర్శనను ఎగ్జిబిటర్లు నిలిపివేస్తారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో సినీ పరిశ్రమ పెద్దలు చొరవ చూపి వారితో చర్చలు జరపాలని మా ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా కోరారు. తెనాలిలోని మా ఏపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎగ్జిబిటర్లు తీసుకోనున్న నిర్ణయం వలన ప్రజలకు వినోదం దూరమయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సభ్యులు అమీర్ చౌదరి, బసవరత్న పాల్గొన్నారు.

జులై 5న జాతీయ లోక్ అదాలత్

తెనాలిరూరల్: జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో మార్చి, జులై 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్, తెనాలి పోక్సో న్యాయస్థానం స్పెషల్ జడ్జి ఎ.ఇందిరాప్రియదర్శిని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల సివిలు, భరణం, బ్యాంకు దావాలు, మోటారు వాహనాల ప్రమాదాల కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలు ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని రాజీవ్ గృహకల్ప సమీప కమ్యూనిటీ హాల్, ఇందిరానగర్ కృష్ణ బలిజ కమ్యూనిటీ హాల్‌లలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈ.డబ్ల్యూ.ఎస్ సహకారంతో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారం ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. స్వయం ఉపాధి కోసం మహిళలకు ఇది ఒక గొప్ప అవకాశమని అన్నారు. 3 నెలలు శిక్షణ పొందిన తరువాత ఉచితంగా కుట్టు మిషన్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు టీమ్ సభ్యులుగా ఏర్పడి పారిశ్రామికంగా అభివృద్ధి చెందవచ్చని పేర్కొన్నారు. మహిళలందరూ శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ ఏడీ మయూరీ, ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ శకుంతల తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది కృషి ఎనలేనిది



సన్మాన కార్యక్రమంలో అధికారులు

తాడేపల్లి రూరల్: శాంతి భద్రత, విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది కృషి ఎనలేనిదని డీఎస్పీ మురళీకృష్ణ అన్నారు. తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీ అయిన కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లకు స్టేషన్ ఆవరణలో సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వారిలో కె.శ్రీనివాసరావు, దానారావు, శివకృష్ణ, వెంకటేశ్వర్లు, మహిళా కానిస్టేబుల్ సూర్యలక్ష్మిలను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. గత 5 ఏళ్లుగా తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఐదుగురు కానిస్టేబుళ్లను వివిధ ప్రాంతాలకు ఉన్నతాధికారులు బదిలీ చేసినట్లు మురళీకృష్ణ తెలిపారు. సీఐ కల్యాణ్ రాజు మాట్లాడుతూ.. ప్రజలకు చేసే సేవలే చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఖాజావలి, శ్రీనివాసరావు, ప్రతాప్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపర సబ్ రిజిస్టర్, సిబ్బందికి సన్మానం



సన్మానిస్తున్న డాక్యుమెంట్ రైటర్స్, ప్రజలు

కొల్లిపర: సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సోమవారం డాక్యుమెంట్ రైటర్స్ ప్రజలు కలసి కొల్లిపర సబ్ రిజిస్టర్ ఆదినారాయణ రెడ్డిని, ఆఫీస్ సిబ్బందిని శాలువాలతో పుష్పమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్స్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలోని ఆఫీసులలో కొల్లిపర సబ్ రిజిస్టర్ ఆఫీస్‌కు ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఐఎస్‌వో గుర్తింపు రావడానికి కారణమైన సబ్ రిజిస్టర్ ఆది నారాయణరెడ్డి కృషి ఎనలేనిదని కొనియాడారు. కొల్లిపర ఆఫీసును మరింత అభివృద్ధి పథంలో ప్రజల భాగస్వామ్యంతో మరింత ముందుకు తీసుకెళ్లాలని సీనియర్ డాక్యుమెంట్ రైటర్‌లు తమ్మా బసవ పున్నా రెడ్డి, బొందలపాటి గంగాధర్ కోరారు. డాక్యుమెంట్ రైటర్లు కోటిరెడ్డి, సుభాని, రమణ శర్మ, బసవ పున్నారెడ్డి, మాధవరెడ్డి, కళ్యాణ్ రెడ్డి, సుబ్బారావు, జానకిరామ్, వీరయ్య, సాంబిరెడ్డి పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టర్‌కు అభినందన

తెనాలిరూరల్: ఏషియన్ యూనివర్సిటీ కప్‌లో పవర్ లిఫ్టింగ్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన తెనాలికి చెందిన షేక్ షబీనాను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. కేఎల్ యూనివర్సిటీలో చదువుతున్న షబీనా ఇటీవల డెహ్రాడూన్ లో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని తమ ప్రతిభ చూపిందని ఆయన అన్నారు.

ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే శిక్షార్హులే



తెనాలి: ప్రపంచ మెట్రాలజీ దినోత్సవం ఈనెల 20న జరగనున్న సందర్భంగా లీగల్ మెట్రాలజీ ఆంధ్రప్రదేశ్ కంట్రోలర్ సౌరభ్‌గౌర్ ఆదేశాలపై 8వ తేదీనుంచి వర్తక సంఘాలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఏపీఎస్ఆర్టీసీ తెనాలి బస్టాండులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో వ్యాపారస్తులు, వినియోగదారులకు ప్యాకేజీ కమాడిటీస్ లీగల్ మెట్రాలజీ శాఖ రూల్స్–2011 గురించి తెనాలి లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ బి.శేషసాయి అవగాహన కల్పించారు. తినుబండారాలు, కూల్‌డ్రింకులు ఎమ్మార్పీ ధరలకన్నా ఎక్కువ అమ్మితే శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. లీగల్ మెట్రాలజి సిబ్బంది, ఆర్టీసీ తెనాలి డిపో మేనేజర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

అర్ధరాత్రిళ్లు ఇళ్లల్లోకి వస్తున్న పందులు



సలాం హోటల్ సెంటర్‌లో సంచరిస్తున్న పందులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ముగ్గురోడ్డు, ఆర్ఎంఎస్ కాలనీ, బోటుయార్డు, సలాం సెంటర్‌లలో రాత్రి సమయాల్లో పందులు సంచరిస్తున్నాయి. వీటివల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. గతంలో పందులను నివారించాలని ఎన్నోసార్లు కార్పొరేషన్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశామని.. అయినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు అంటున్నారు. తాడేపల్లిలో పాత రైల్వే క్వార్టర్స్‌లో పగటి పూట ఆశ్రయం పొందుతున్న పందులు రాత్రి సమయంలో రోడ్డుమీదకు వచ్చి సంచరిస్తున్నాయి. ఒక్కోసారి నీళ్లు, ఆహారం కోసం ఇళ్లల్లోకి వచ్చేస్తున్నాయి. ఇక్కడ నివసించే ప్రజలు పేదలు కావడంతో ఇంటిచుట్టూ ప్రహరీ గోడకు బదులు దడులు ఏర్పాటు చేసుకున్నారు. వాటిని పడగొట్టి ఇళ్లల్లోకి వచ్చి ఆహార పదార్థాలు, నీళ్లను పాడుచేస్తున్నాయని వారు వాపోతున్నారు. ఎటువంటి ప్రాణహాని కలుగక ముందే పందులను నివారించాలని ప్రజలు కోరుతున్నారు. ఒక్కోసారి పందులు వాహనాలను ఢీకొనడంతో వాహన చోదకులు తీవ్ర గాయాలపాలవుతున్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడిని అరికట్టాలి



ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మంగళగిరి, తాడేపల్లి రూరల్: ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడిని అరికట్టాలని రాష్ట్ర ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. నగర పరిధిలోని ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు కమిషనర్ కృతిక శుక్లాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వల రాజు, బందెల నాసర్ జీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక కార్పొరేట్ కళాశాలల్లో అకాడమీల పేరుతో ఇంటర్ బోర్డు గుర్తింపు లేని జూనియర్ కళాశాలలను నిర్వహిస్తూ విద్యార్థుల తల్లితండ్రుల నుంచి రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఎంసెట్, నీట్, ఐఐటీ, జేఈఈ మెయిన్స్ పేరుతో లాంగ్ టర్మ్ కోచింగ్ అంటూ కోట్ల రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. తక్షణమే అటువంటి కళాశాలలపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఫణీంద్ర, నాగభూషణం, గుంటూరు జిల్లా కార్యదర్శి యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

హనుమజ్జయంతికి ఏర్పాట్లు పూర్తి

ఫిరంగిపురం: హనుమజ్జయంతిని పురస్కరించుకుని మండలంలోని దక్షిణాముఖ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. పండుగ పర్వదినం సందర్భంగా అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణలు గురువారం ఉదయం 5 గంటలకు స్వామికి విశేష పూజలు నిర్వహిస్తారని దేవాదాయధర్మాదాయ శాఖ ఈవో జె.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. మధ్యాహ్నం 11గంటలకు ఉత్సవ మూర్తులకు కల్యాణం నిర్వహిస్తారన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సాయంత్రం ఒంటె వాహనంపై ఉత్సవ మూర్తులకు ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా 113 తాళ్లూరులోని ప్రసన్నాంజనేయస్వామికి బుధవారం నుంచి ఉదయం పంచామృతాల అభిషేకాలను వేద పండితులు దివి.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆలయం అర్చకులు ప్రసన్నమూర్తి తెలిపారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. వేమవరం అడ్డరోడ్డులోని అభయాంజనేయుడికి, గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు కోడూరి రామకోటేశ్వరరావు, మల్లేశ్వరరావు, పొట్టి వీరేశం గుప్తాలు తెలిపారు.

పతకాలు సాధించిన కేఎల్‌యూ లిఫ్టర్లు



పతకాలు సాధించిన విద్యార్థినిని అభినందిస్తున్న కేఎల్‌యూ ఆచార్యులు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినిలు పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించారు. సోమవారం విద్యార్థినులను కేఎల్‌యూ ఆచార్యులు అభినందించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ సుబ్బారావు మాట్లాడుతూ.. ఏషియన్ యూనివర్శిటీ క్లాసిక్ లిఫ్టింగ్ కప్, ఏషియన్ సబ్ జూనియర్, జూనియర్ పురుషులు, మహిళల ఛాంపియన్ షిప్ టోర్నీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన కేఎల్‌యూ మహిళా లిఫ్టర్ ఎం.షానూన్ స్క్వాడ్, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్‌లలో ప్రతిభ కనబరిచి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. డెహ్రాడూన్‌లో జరిగిన ఈ పోటీలలో మహిళల 47 కిలోల విభాగంలో స్వర్ణ పతకం, 84 ప్లస్ విభాగంలో నగర్ జ్ఞాన దివ్య స్వర్ణ పతకం, 84 కిలోల విభాగంలో షేక్ షబీనా స్వర్ణపతకం సాధించారని పేర్కొన్నారు. ఏషియన్ సబ్ జూనియర్, జూనియర్ పురుషులు, మహిళల ఛాంపియన్ షిప్ టోర్నీలో 47 కిలోల విభాగంలో మదిరా షనూన్ కాంస్య పతకం, 84 ప్లస్ కిలోల విభాగంలో నగర్ జ్ఞాన దివ్య రజత పతకం, 84 కిలోల విభాగంలో షేక్ షబీన స్వర్ణ పతకం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కేఎల్‌యూ వీసీ పార్థసారధి వర్మ, ప్రో వీసీలు, డీన్‌లు, డైరెక్టర్లు తదితరులు అభినందించారు.

కార్మికుల సమస్యలను విస్మరించిన ప్రభుత్వం



కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం విస్మరించిందని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు అన్నారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని కార్మిక నాయకుడు కూరపాటి స్టీవెన్, బి.అంకయ్య, సూర్య ప్రకాశరావులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులు 167 రోజులుగా ఆందోళన చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం త్వరితగతిన స్పందించి కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.అంజయ్య, దానయ్య, మాణిక్యాలరావు, ఆశీర్వాదం, గురవయ్య, సాంబయ్య, లక్ష్మి, రమణ, శారద, సువర్ణకుమారి, ఇమాంబి తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం



తెనాలిరూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితురాలికి తక్షణ సాయంగా రూ.5 వేల నగదు, బియ్యం, నిత్యావసరాలను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ సోమవారం అందజేశారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం స్థానిక చెంచుపేట కోనేరు వారి వీధికి చెందిన ఒంటరి మహిళ అవులూరి శాంతమ్మ రోడ్డు మార్జిన్ లో నిమ్మకాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తుంది. ఈ నేపథ్యంలో ఆదివారం సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఆమెను పరామర్శించి సహాయం చేశారు.